క్లుప్తంగా

ఆంగ్ల భాషపై శిక్షణ



మాట్లాడుతున్న ఏఎంఓ రవికుమార్

మధిర: మధిర టీవీఎం పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న ఆంగ్ల భాషపై శిక్షణా శిబిరాన్ని సోమవారం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల భాషాభివృద్ధి, ఆంగ్ల భాష ప్రాముఖ్యత, సులభశైలిలో బోధించే శైలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో మాడ్యూల్స్ సహాయంతో సులభ శైలి విధానాలను చర్చించాలని కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటును నిలిపివేస్తూ ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం వైరాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు హరినాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ రుణాలు సద్వినియోగం చేసుకోండి

ముదిగొండ: రైతులు సహకార సొసైటీలో రుణాలు పొందిన వారు సకాలంలో రుణాలు చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని ఎల్ఎస్సీఎస్ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అన్నారు. ముదిగొండలోని సహకార సొసైటీ కార్యాలయంలో సోమవారం సమావేశంలో మాట్లాడారు. ముదిగొండ సహకారసొసైటీ పరిధిలోని రైతులకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటల సీజన్‌కు రూ.50 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. సమావేశంలో సీఈఓ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

సత్తుపల్లి టౌన్: సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, పలు వార్డుల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే రఫీ, అంకమరాజు, మాధురి మధు, శ్రీను, కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ముదిగొండ/కల్లూరురూరల్/వేంసూరు: మండలంలోని అర్హులైన నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్లు వై.రామారావు, బాబ్జి ప్రసాద్, డీటీ కరుణశ్రీ లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో మహిళ పేరుతో సొంత ఇంటి స్థలం, మహిళ పేరుతో ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నివాసధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణపత్రం, ఖాళీస్థలం హక్కు పత్రం, బ్యాంక్ బుక్ జిరాక్స్ కాపీలతో పాటు కులధృవీకరణ పత్రాలను దరఖాస్తుకు జతచేయాలన్నారు. వికలాంగులైతే సదరం సర్టిఫికెట్ జిరాక్స్ జతచేయాలన్నారు. ఈ నెల 10లోపు తహసీల్‌లో అందించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు సెల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

మధిర: అన్నం పరబ్రహ్మ స్వరూపమని మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి అన్నారు. బుధవారం స్థానిక శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద నాళ్ల భరణి, ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు శ్రీహర్ష పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి రవిశాస్త్రి, శ్రీనివాసరావు, జగదీష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీలో చేరికలు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం ఆప్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాబూలాల్ పవార్ నేతృత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికలలో డబ్బులు పంచి ఓట్లు అడిగే పార్టీలను ఓడించాలన్నారు. ఉచిత, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పన, మౌళిక సదుపాయల కల్పనే ఆప్ ఎజెండా అన్నారు. పార్టీలో చేరిన వారిలో గుడివాడ వెంకటేశ్వరరావు, పిడియాల శ్రీకాంత్, షేక్‌ఫిరోజ్, అనీల్, జగన్, సునీల్ తదితరులు ఉన్నారు.

నిరీక్షించాల్సిందేనా..?

మధ్యాహ్న భోజన బిల్లుల కోసం ఎదురుచూపులు

- 3 నెలలుగా నిలిచిన బిల్లులు
- అప్పుల పాలవుతున్న కార్మికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ర్యాలీ చేస్తున్న కార్మికులు (ఫైల్)



వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఏన్కూరు: ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారాన్ని అందస్తున్నాం. సమూల మార్పులు తీసుకొచ్చాం. అంటూ ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమవుతుంది తప్ప మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదు. దీంతో నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కోట్లాది రూపాలయలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కార్మికులు అప్పుల చేసి మరీ పెట్టుబడి పెడుతుండడంతో పారదర్శకత కొరవడుతోంది. దాని ప్రభావం విద్యార్థులకు పెట్టే భోజనంపై పడుతుంది. నాణ్యత కొరవడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. వీరి సమస్యలపై మధ్యాహ్న ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం స్పందించడం లేదు.

మండలంలోని పాఠశాలలు..

మండల వ్యాప్తంగా 48 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. సుమారు 75 మంది వరకు వర్కర్లు పనిచేస్తున్నారు. రోజుకు సగటున 2,200 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి నెలా లక్షల్లో ఖర్చుచేస్తున్నారు. అయితే ప్రభుత్వం మూడు నెలలు గడిచినా బిల్లులు మాత్రం చెల్లించలేదు.

రావాల్సిన పెండింగ్ బిల్లులు..

ఈ పాఠశాలలకు కిరణాసరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు అన్నింటికీ కలిపి నెలకు సుమారు రూ.2.50 లక్షల బిల్లులు వస్తాయి. ఏప్రిల్, జూన్, జూలై మూడు నెలలు కలిపి రూ7.50 లక్షలు రావాలి. 75 మందికి వర్కర్లకు నెలకు రూ.1,000 చొప్పున రెండు నెలలకు కలిపి రూ.3 లక్షలు రావాలి. కానీ ప్రభుత్వం ఈ మూడు నెలల బిల్లులు, వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదు.

అప్పుల పాలవుతున్న కార్మికులు..

కూరగాయలు, కిరణాదుకాణాలల్లో అప్పులు పెరిగిపోతున్నాయి. అప్పుల ఇవ్వకపోతే వారిని బతిమిలాడి అప్పు తీసుకురావల్సి వస్తుంది. దీంతో పాటు కొడిగుడ్డు ధర కూడా బాగా పెరిగిపోయింది. ప్రభుత్వం పాఠశాలలకు నిత్యావసర వస్తువులు, కూరగాయాలు పంపిణీ చేసి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

త్వరగా బిల్లులు చెల్లించాలి..



3 నెలలుగా బిల్లులు, 2 నెలలుగా వేతనం రాలేదు. సరుకులకు వడ్డీలకు తీసుకొచ్చి మరీ భోజనం పెడుతున్నాం. దీంతో దుకాణాదారులు మాకు అప్పులు ఇవ్వడం లేదు. అసలే కూరగాయల ధరలు కూడా నింగికంటాయి. ఈ ఏడాది ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, కూరగాయలు, కొడిగుడ్లు, రాగిజావ పంపిణి చేసి మధ్యాహ్న భోజనం కార్మికులకు పెంచిన రూ.3 లు వేతనం ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– పూర్ణకంటి కమలమ్మ, మధ్యాహ్న భోజన వర్కర్, ఏన్కూరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ అలేఖ్య

పెనుబల్లి : సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ సర్పంచ్‌లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ అలేఖ్య అన్నారు. పెనుబల్లిలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సభలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ బగీరథ తాగునీరు అందడం లేదని, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. దీంతో ఎంపీపీ అలేఖ్య స్పందించి సర్పంచ్‌లు పారిశుధ్య పనులను మొక్కుబడిగా కాకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని గ్రామాలకు నీరు అందేలా చూడాలన్నారు. అనంతరం పెనుబల్లి నుంచి బదిలీ అయిన ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఎంపీఓ వాల్మీకి కిషోర్, సర్పంచ్ గోదా చెన్నారావు, మందడపు అశోక్ కుమార్, ఆళ్ల అప్పారావు, సోడె రాంబాబు, ఎంపీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం సుశీలకు సత్కారం



సుశీలను సత్కరిస్తున్న పెద్దమునగాల గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది

కొణిజర్ల: ఏఎన్ఎంగా ఉత్తమ సేవలందించినందుకు గాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా నైటింగేల్ ఆఫ్ ఇండియా అవార్డు పొందిన తేజావత్ సుశీలను ఘనంగా సత్కరించారు. సోమవారం కొణిజర్ల మండలం పెద్దమునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచ్ శ్రీనివాసరావు, హెచ్ఎం కృష్ణయ్యలు ఆమెను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో ప్రజలకు మేలు



మోదీ అభివృద్ధి పనుల పుస్తకాన్ని అందజేస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలో బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ.. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా 15వ బెటాలియన్ కమాండెంట్ వెంకట్‌రాములు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, హైస్కూల్ హెచ్ఎం శైలకుమారి, బ్యాంక్ మేనేజర్లు నరేష్, నరేంద్ర, విద్యావేత్తలు, వ్యాపారులను కలిసి మోదీ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను ముద్రించిన పుస్తకాలను వారికి అందించారు.

కాలేజీలో సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై వినతి అందిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో తాగునీరు, టాయ్‌లెట్లు, ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలేజీలో సమస్యలు పరిష్కరించడానికి కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్వార్, నాని, మున్న, సాయినాద్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన



చేతిపంపు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శిరీష

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికలో చేతిపంపు నిర్మాణానికి ఎంపీపీ దేవరకొండ శిరీష శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ కృషితో చేతి పంపు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షులు పంబి సాంబశివరావు, మారబత్తుల బాలాజీ, యాకోబు, వెంకన్న, బాలరాజు, ఏసోబు, ఏబు, పెద్ద బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామాల అభివృద్ధిపై సోమవారం ఈపీఆర్‌ఏ ప్రదర్శన నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో సదుపాయాలు, ప్రభుత్వ సంస్థలు తదితర అంశాలను వివరించారు. వైరా కేవీకే శాస్త్రవేత్తలు ఫణీ, నాగరాజు, సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మి, హెచ్ఎం సైదయ్య, పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం

తల్లాడ: కాంగ్రెస్ పార్టీతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని కొండూరి సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాధపురం గ్రామంలో వ్యవసాయ కూలీలను కలుసి వారితోపాటుగా పొలంలో నాటు వేశారు. ఈ కార్యక్రమంలో పోట్రు శ్రీనివాసరావు, తుమ్మపల్లి రమేష్, మాగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలలకు సామగ్రి వితరణ



వితరణ అందించిన బెంచీలపై విద్యార్థులు

సత్తుపల్లి టౌన్: రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి అందించిన ఆర్థిక సాయంతో సోమవారం సత్తుపల్లి మండలంలోని రుద్రాక్షపల్లి, బంగ్లాబజార్, కొమ్ముగూడెం, బాసారం ప్రాథమిక పాఠశాలలకు డెస్క్ బెంచీలు, కాకర్లపల్లి సొసైటీకి రెండు కుర్చీలు, ఒక బీరువా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ పూచి చిలకమ్మ, ఉప సర్పంచ్ దుంప రాఘవులు, సొసైటీ చైర్మన్ తుమ్మూరి ప్రసాద్ బాబు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ దాసరి ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయకణ రెడ్డి

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మండలంలోని లూర్థుమాతా హైస్కూల్‌లో కర్నాటి లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఇన్స్టలేషన్ ఆఫీసర్ నంబూరి మధు లయన్స్‌క్లబ్ తల్లాడ నూతన అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, కార్యదర్శి నంబూరి కనకదుర్గా ప్రసాద్, కోశాధికారి ఆంజనేయులతో పాటుగా సభ్యత్వం తీసుకున్న 12 మంది సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ.. నేడు జిల్లాలో పలు సేవా కార్యక్రమాలలో క్లబ్ ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో దారా శ్రీనివాసరావు, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, బుచ్చిరామారావు, జవ్వాజి నగేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో సోమవారం రాత్రి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలు ఏలా అభివృద్ధి చెందాయో ప్రజలే గమనించాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యకమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, రైతుబంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లిఖార్జున్, బానోత్ కొండ, తమ్మారపు బ్రహ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో



ముదిగొండ: ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

ముదిగొండ: గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 33వ రోజు సోమవారం ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాస్తారోకో చేపట్టారు. గ్రామాల్లో పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

కల్లూరు: మండలంలోని పంచాయతీ కార్మికులు సమ్మె శిబిరం నుంచి ప్రధాన ప్రధాన సెంటర్‌కు చేరుకుని ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సమ్మెకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు జి.సీతారామయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీపీ కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు వెంకన్న, ఖమ్మంపాటి పుల్లారావు, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్, ఆంజనేయులు, ఊడల కృష్ణమూర్తి, సయ్యద్ వజీర్ మియా, కొత్తపల్లి సుధాకర్, చింతపల్లి శ్రీను, మైస్య, వెంకటయ్య, నల్లగట్ల చిన్న, రావూరి లక్ష్మి, మరియమ్మ, యశోధ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి విస్తృత పర్యటన



పెనుబల్లి: సర్వేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వేంసూరు/సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వేంసూరు మండలంలోని దుద్దెపూడిలో ఇటీవల నిర్మించిన చర్చికి విరాళం అందించారు. అదే విధంగా పలు గ్రామాల్లోని అనారోగ్యంతో బాధపడుతున్న గమిడెల్లి పద్మ, గొర్లవెంకటప్పరెడ్డి, కర్రి వెంకటేశ్వరరావులను, అమెరికా రెడ్డిని పరామర్శించారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన ఎలిగినేని రాజేశ్వరరావును, అడసర్లపాడులో గాదె వెంకమ్మఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అదే విధంగా సత్తుపల్లి మండలంలో తుంబూరులో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రసాద్ కుటుంబాన్ని, అనారోగ్యానికి గురైన కర్లపూడి రామారావును పరామర్శించారు. పెనుబల్లి మండలంలో మండాలపాడులో ఇటీవల మాజీ సర్పంచ్ పిల్లి నవజీవన్ తండ్రి సర్వేశ్వరరావు మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కొండూరు సుధాకర్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, మందపాటి ముత్తారెడ్డి, మలిరెడ్డి మురళీరెడ్డి, చిన్నస్వామి, వంగా దాము, అట్లూరి సత్యానారయణరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గద్దర్ మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

మధిర/తల్లాడ: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతికి సోమవారం మధిర బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా మధిరలో న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు మాట్లాడుతూ.. జీవితమంతా పోరాడిన గొప్ప యోధుడు గద్దర్ అని కొనియాడారు. అదే విధంగా తల్లాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్ రెడ్డి, ఏపీపీ నాగలక్ష్మి, న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా నాయకులు షేక్ లాల్‌మియా, రామక్రిష్ణ, డి.శ్రీనివాసరావు, వెంకట్, గట్టయ్య, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, రాకేష్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ గ్రామానికి చెందిన జట్టి ఝాన్సీలక్ష్మీని వేధిస్తున్న ఆమె భర్త, అత్తమామలతో పాటు ఆడపడుచుపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం కొత్త అగ్రహారానికి చెందిన నరేంద్రతో రెండేళ్ల క్రితం ఝాన్సీలక్ష్మికి వివాహం జరిగింది. అయితే, అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను భర్తతో పాటు అత్తామామలు, మరిది, ఆడపడుచులు వేధిస్తూ ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీంతో బాధితురాలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ముదిగొండ: బైకు అదుపుతప్పి కింద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి శ్రీనివాస్ ముదిగొండలో రెగ్జిన్‌వర్క్ చేసుకొని ఇంటికి వస్తున్న సమయంలో ఖమ్మం–కోదాడ రహ దారిలో గోకినేపల్లి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించడంతో అతనిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మానవ హక్కులపై అవగాహన

చింతకాని: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిస్సిహారిణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మధిర డివిజన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ మధిర డివిజన్ అధ్యక్షుడు వెంకట్, జిల్లా సలహాదారులు యశోద, నాని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్సీరాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

సత్తుపల్లిటౌన్/తల్లాడ: సత్తుపల్లి సెక్టార్‌లోని రేజర్లలో, తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుజాత, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ముర్రుపాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృదుల, ఏఎన్ఎం సరోజిని, సర్పంచ్ ప్రభాకర్, తల్లాడ సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



మధిర: పశువులకు మందు వేస్తున్న సర్పంచ్ శిరీషా రామిరెడ్డి

మధిర: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని తొండల గోపవరం సర్పంచ్ పింగళి శిరీషా రామిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని తొర్లపాడు, సాయిపురం, జాలిముడి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, ముద్ద వ్యాధి టీకాలతో పాటుగా నులిపురుగుల వ్యాధి నివారణ మందులను పశువుల నోటిలో వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సిబ్బంది మహమ్మద్ రఫీ, లక్ష్మణరావు, కొండలరావు, రమేష్, జాన్‌బీ, కరీమున్, సాయి చంద్రిక, భాస్కర్, వెంకటేశ్వర్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబంజరు, శ్రీరామపురం, రావికంపాడు గ్రామాల్లో సోమవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 2,565 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను కల్లూరు పశువైద్యాధికారి డాక్టర్ మమత వేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశుపోషణ గురించి డాక్టర్ మమత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 | ఖమ్మం-1 కె. సురేష్ - 90631 99777
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | మధిర వీరబాబు - 98498 64638
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
ఎన్. జయరాజు - 96528 68642
రవికుమార్ - 99499 27792